సాక్షి
శ్రీకాకుళం

గురువారం । 9 । అక్టోబర్ । 2025



కాసుల వరద

ఇసుకాసురులకు కాసుల వరద పారుతోంది. ఇసుక ధర అమాంతం పెరిగాయి.

- 8లో



నేత్రం.. జర భద్రం

కంటి సమస్యలు పెరుగుతున్నాయి. సెల్‌ఫోన్ వాడకం ప్రమాదకరంగా మారుతోంది.

- 8లో

రేపు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 10వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి జెడ్పీ సమావేశ మందిరంలో జరుగుతాయని జెడ్పీ సీఈఓ డి.సత్యనారాయణ ప్రకటించారు. 10.30 గంటల నుంచి 6వ స్థాయీ, 11.30 గంటల నుంచి 3వ స్థాయీ, 12.30 గంటల నుంచి 5వ స్థాయీ, అనంతరం మధ్యాహ్నం 2వ, 4వ, 1వ, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని ఆయన తెలియజేశారు.

న్యూస్‌రీల్

ఆకాశ దీపం వెలిగింది



ఆలయం పైన ఆకాశ దీపం ఏర్పాటు చేస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం ఆలయంపైన బుధవారం ఆకాశ దీపం వెలిగించారు. ఒడిశా సంప్రదాయం ప్రకారం ఆశ్వయుజ మాసం పౌర్ణమి అనంతరం బహుళ పాడ్యమి నుంచి కార్తీక పౌర్ణమి వరకూ ఇలా ప్రతి రోజూ అర్చకులు వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాన్ని వెలిగిస్తారు. పాడ్యమి నుంచి కార్తీక పౌర్ణమి వరకూ ఒడిశా నుంచి భక్తుల తాకిడి ఉంటుందని అర్చకులు తెలిపారు. అలాగే ఒడిశా వాసులు గౌరీపౌర్ణమి నుంచి కార్తీక పౌర్ణమి వరకూ కార్తీక మాసంగా పాటిస్తారు.

నాడు కాదని.. నేడు అదే పని!

శ్రీకాకుళం: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేస్తున్న ప్రకటనలకు చేపడుతున్న పనులకు పొంతన లేకుండా పోతోంది. గతంలో వైఎస్సార్‌సీపీ హయాంలో కొందరు టీచర్లకు రాష్ట్రస్థాయిలో బదిలీలను చేశారు. అయితే విద్యా సంవత్సరం పూర్తయ్యే నాటికి ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారడంతో వీరిని రిలీవ్ చేయలేదు. అప్పట్లో నారా లోకేష్ రాష్ట్రస్థాయి బదిలీలపై విమర్శలు గుప్పించారు. అధికారంలోకి రాగానే ఆ బదిలీలను రద్దు చేశారు. ఇప్పుడు తాజాగా కూటమి ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో బదిలీలు చేయడం గమనార్హం. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటివరకు ఓ ఉపాధ్యాయురాలికి ఇలా బదిలీ జరిగింది. ఈమె భర్త ఓ ప్రజా ప్రతినిధి వద్ద పీఏగా పనిచేస్తున్నట్లు సమాచారం. పైగా దీన్ని రహస్యంగా ఉంచేందుకు ప్రయత్నించడం విమర్శలకు తావిస్తోంది. బదిలీల ఉత్తర్వులు సహజంగా మెయిల్స్ ద్వారా విద్యా శాఖకు వస్తుంటాయి. ఈసారి మాత్రం బదిలీల ఉత్తర్వులు జిల్లా విద్యాశాఖ అధికారుల వాట్సాప్‌కు పంపడాన్ని ఉపాధ్యాయ వర్గాలు తప్పుపడుతున్నాయి.

సువర్ణభూషిత కూర్మనాథుడు

- దశాబ్దాల తర్వాత కూర్మనాథునికి ఆభరణాల అలంకరింపు
- 80 ఏళ్లుగా సింహాచలం దేవస్థానంలో భద్రపరిచిన వైనం




శ్రీకూర్మనాథుని మూర్తులకు అలంకరించిన బంగారు ఆభరణాలు

గార: ఎనభై ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత కూర్మనాథుని సువర్ణ ఆభరణాలు మళ్లీ స్వామి విగ్రహాన్ని అలంకరించాయి. ఎనిమిది దశాబ్దాల పాటు సింహాచలంలోనే ఉండిపోయిన ఆభరణాలు మళ్లీ ఇన్నాళ్లకు అవి శ్రీకూర్మం చేరాయి. శ్రీకూర్మనాథుని ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి, గోవిందరాజస్వామి, శ్రీరామ, లక్ష్మణస్వామి, సీతమ్మ వార్లకు బంగారు ఆభరణాలను బుధవారం అలంకరించారు. సుమారు 3 కిలోల బంగారం కలిగిన ఆభరణాల్లో గోవింద రాజస్వామి, శ్రీరామ, లక్ష్మణ విగ్రహాలకు వక్ష స్థలం, కవచాలు, కంటెలు, భుజ కీర్తులు వంటివి ఉండగా, అమ్మవార్ల విగ్రహాలకు కిరీటాలతో పాటు మెడలో వేసుకున్న శేరులు వంటివి ఉన్నాయి.

80 ఏళ్ల కిందట ఆభరణాలకు ఆలయంలో రక్షణం కల్పించలేమని అప్పటి అధికారుల అభ్యర్థనతో సింహాచలం దేవస్థానంలో భద్రపరిచారు. అప్పటి నుంచి శ్రీకూర్మనాథాలయంలో జరిగే ప్రధాన ఉత్సవాలైన డోలోత్సవం, కల్యాణోత్సవం, శ్రీకూర్మనాథుని జయంత్యుత్సవాలకు సైతం వీటిని తీసుకురాలేదు. ఆలయంలో పనిచేస్తున్న వైదిక సిబ్బంది, అధికారులు చాలా మంది వీటిని ఇప్పటివరకు చూడలేదు. దేవస్థానం ధర్మకర్త పూసపాటి అశోకగజపతిరాజు గోవా గవర్నర్‌గా బాధ్యతలు తీసుకోవడానికి ముందు ఆలయానికి వచ్చి దీనిపై లేఖ రాస్తానని చెప్పారు. గురువారం ఉదయం భద్రత నడుమ తీసుకు వచ్చి గర్భగుడి సమీపంలోని అద్దాల మంటపంలోని స్వామి ఉత్సవ మూర్తులకు అలకరింపజేసి భక్తుల దర్శనార్థం ఉంచారు.



సారవకోట మండలం అవలింగి సమీపంలోని దుర్గా వైన్ షాపులో, సమీపంలోని ఇంట్లో సెప్టెంబర్ 2వ తేదీన నకిలీ మద్యం దొరికింది. మందుబాబుల ప్రాణాలు తీసే మద్యంగా అనుమానాలు ఉన్నాయి. ఒడిశా, చత్తీస్‌గఢ్ నుంచి తీసుకొచ్చిన ఆల్కహాల్‌కు కలర్ కలిపి నకిలీ మద్యం తయారు చేసి, బాటిలింగ్ చేసి విక్రయిస్తున్నట్టుగా ఆరోపణలు ఉన్నాయి. దానికోసమే ఏకంగా ఇళ్లు అద్దెకు తీసుకుని, ఆర్గనైజ్డ్ క్రైమ్ చేస్తున్నట్టుగా తెలుస్తోంది. ఆ ఇంట్లో వేలల్లో ఖాళీ సీసాలు, నకిలీ మూతలు, బ్యాచ్ నంబర్ స్టాంపింగ్ మిషన్ వంటివి దొరికాయి.



అంతకుముందు టెక్కలి ఆర్టీసీ డిపో సమీపంలో ఓ మద్యం దుకాణంలో కొన్న సీసా సీల్‌లో తేడా ఉండటాన్ని గుర్తించారు. మూతతీసి చూసి మద్యం కల్తీ అయిందని గుర్తించారు. రెగ్యులర్‌గా అదే బ్రాండ్ తాగే వ్యక్తికి తేడా తెలియడంతో కల్తీ అయిందని గోల పెట్టారు.

అదే టెక్కలిలో 55 ఏళ్ల వయసు గల వ్యక్తి ఓ వైన్‌షాపులో మద్యం బాటిల్ తీసుకుంటే మూత లూజ్‌గా ఉండటం గమనించారు. ఇదేంటి లూజుగా ఉందని ఆ వ్యక్తి నిలదీస్తే షాపులో ఉన్న వారు ఎక్కువ వాగకు అంటూ మెడపెట్టి తోసేశారు. దీంతో ఆ వ్యక్తి కింద పడిపోయి కన్నీటి పర్యంతమయ్యారు.

జిల్లాకూ నకిలీ మకిలి



- ఒడిశా సరిహద్దు నియోజకవర్గాల్లో నకిలీ మద్యం తయారీ
- సారవకోట మండలం అవలింగిలో బయటపడిన నకిలీ మద్యం బాగోతం
- నకిలీ మద్యం కేసులో పరారీలో టీడీపీ నాయకుడు నీలకంఠం
- టెక్కలిలో బయటపడ్డ రెండు మూడు పరిణామాలు
- టీడీపీ నాయకుల చేతుల్లోనే సిండికేట్
- నకిలీ, కల్తీ మద్యమంతా బెల్ట్‌షాపులకే వెళ్తున్న వైనం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

రాష్ట్రాన్ని కుదిపేస్తున్న నకిలీ మద్యం ఆనవాళ్లు జిల్లాలోనూ కనిపించాయి. నిజానికి రాష్ట్రంలోని మిగతా చోట కంటే ముందే శ్రీకాకుళం జిల్లాలో ఈ బాగోతం బయటపడింది. ఇందులో టీడీపీ నాయకుడు మీసాల నీలకంఠం పాత్ర ఉన్నట్టు తేలింది. ఇప్పుడాయన ముందస్తు బెయిల్ కోసం యత్నిస్తున్నారు. ఒడిశాకు ఆనుకుని ఉన్న టెక్కలి, ఉద్దానం వంటి ప్రాంతాల్లో చీప్ లిక్కర్‌కు ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్(స్పిరిట్), కెరామల్ వంటి రసాయనాలు కలిపి ఏకంగా బాటిల్స్ తయారు చేస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఆంధ్రాలోని ఖరీదైన వైన్‌లో కూడా చీప్ లిక్కర్, వాటర్ మిక్సింగ్ చేసి బాటిల్స్ తయారు చేస్తున్నారు.

ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో కల్తీ మద్యం దందా నడుస్తోంది. ముఖ్యంగా తీర ప్రాంతాలకు పడవలపై ఒడిశా నుంచి చీప్ లిక్కర్, సారా వస్తోంది. అక్కడి నుంచి వచ్చిన లిక్కర్‌ను జిల్లాలోని రహస్య ప్రాంతాలకు తరలించి బ్రాండ్ మిక్సింగ్ చేస్తున్నట్టుగా సమాచారం. దానికోసం ప్రత్యేకంగా ఖాళీ సీసాలు, నకిలీ మూతలు, బ్యాచ్ నంబర్ స్టాంపింగ్ మిషన్లను అక్రమార్కులు సమకూర్చుకున్నారు. సారవకోట మండలం అవలింగిలో ఇప్పటికే ఇవన్నీ దొరికాయి. రాజకీయ విభేదాల కారణంగా అక్కడ గుట్టు రట్టయ్యింది. లేదంటే గుట్టు చప్పుడుగా సాగిపోయేదే. మిగతా ప్రాంతాల్లోనూ ఈ రకమైన డెన్‌లు నడుస్తున్నట్టు తెలుస్తోంది.

గుర్తించలేనంతగా..

జిల్లాలో నిపుణుల చేత కల్తీ చేయిస్తూ అసలేదో, కల్తీ ఏదో గుర్తించలేనంతగా మందుబాబులను మోసం చేస్తున్నారు. ఈ కల్తీ చాలా చోట్ల అనుభవం ఉన్న నౌకర్ నామాలే చేస్తున్నట్టుగా ఆరోపణలు ఉన్నాయి. అందుకనే దాదాపు వైన్ షాపుల నిర్వాహకులు అనుభవం ఉన్న నౌకర్ నామాలను పెట్టుకుంటారు. దీనికి తోడు పర్మిట్ రూమ్‌లకు కూడా అనుమతి ఇవ్వడంతో కల్తీ మరింత సులభం అవుతోంది. లూజు అమ్మకాలు జరుగుతుండటంతో అక్కడికక్కడే బ్రాండ్ మిక్సింగ్ చేస్తున్న పరిస్థితులు ఉన్నాయి.


కల్తీ మద్యంతోనే ప్రమాదం

ఒడిశాకు అనుకుని సరిహద్దు ప్రాంతాలు జిల్లాలో ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, టెక్కలి తదితర నియోజకవర్గాలు ఒడిశాకు దగ్గరలో ఉన్నాయి. ఒడిశాలో ప్రస్తుతం చీప్ లిక్కర్ క్వార్టర్ బాటిల్ ధర రూ.70నుంచి రూ.150వరకు ఉంది. అదే ఆంధ్రప్రదేశ్‌లోనైతే రూ. 99నుంచి రూ.220వరకు ఉంది. ఇక్కడ కంటే ఒడిశా చీప్ లిక్కర్ క్వాలిటీ బాగుంటుందంటారు. అందుకనే అక్కడి చీప్ లిక్కర్ తీసుకొచ్చి మన రాష్ట్రానికి చెందిన చీప్ లిక్కర్‌లో స్పిరిట్ మిక్సింగ్ చేసి బాటిల్స్ తయారు చేస్తున్నట్టు తెలుస్తోంది. అదే విధంగా ఒడిశాలో సారా లీటర్ రూ.60నుంచి రూ.110వరకు దొరుకుతుంది. దాన్ని కూడా దిగుమతి చేసుకుని స్పిరిట్, కెరామల్ మిక్స్ చేసి చీప్ లిక్కర్‌గా తయారు చేస్తున్నారన్న వాదనలు ఉన్నాయి. ఇదైతే అంతకంత లాభం ఉంటుంది. ఇది దాదాపు ప్రాణాలు తీసే మద్యమే అనుకోవాలి.

ఒడిశా నుంచి ముడి సరుకు..

ఒడిశాలోని బరంపురం, పర్లాకిమిడి, రాయగడ, కొరాపుట్, సునాబెడ, చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కల్తీ మద్యం బాటిలింగ్ చేసేందుకు యంత్రాలు, మెటీరియల్ అన్నీ విక్రయిస్తున్నారు. అక్కడ చాలా వరకు అనధికారికంగా నడిచేవి ఉన్నాయి. అక్కడి నుంచి మన సరిహద్దు ప్రాంతాల మీదుగా, తీర ప్రాంతాలకు పడవల మీదుగా రవాణా చేస్తున్నట్టు తెలుస్తోంది.

బెల్టుషాపులకే కల్తీ మద్యం..



జిల్లాలో తయారవుతున్న కల్తీ మద్యం బాటిల్స్ ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోని బెల్ట్‌షాపులకే వెళ్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో సిండికేట్ నడుస్తోంది. ఒకవైపు కౌంటర్‌లో ఎమ్మార్పీకి మించి విక్రయాలు చేపడుతుండగా, మరోవైపు పర్మిట్, బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తోంది. సిండికేట్ అంతా టీడీపీ నాయకుల చేతుల్లోనే ఉంది. వారు ఏం చెబితే అదే జరుగుతోంది. ఫలితంగా బెల్ట్‌షాపుల్లో తనిఖీలు, పట్టుకోవడాలు జరగడం లేదు. ముడుపులు నడుస్తుండటంతో అంతా గుట్టుగా సాగిపోతోంది. రాజకీయ విభేదాలు తలెత్తితేనే గుట్టు బయటపడుతోంది.



టీడీపీ నాయకుడు నీలకంఠం అద్దెకు తీసుకున్న ఇంట్లో దొరికిన ఖాళీ సీసాలు, మూతలు

మహిళలను అడ్డుకుంటున్న పోలీసులు



న్యాయ పోరాటం చేద్దాం

- రైతు సంఘం నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు

పలాస: పచ్చటి ఉద్దానంలో నిర్మించతలపెట్టిన కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా న్యాయ పోరాటం చేయాలని మాజీ మంత్రి, రైతు సంఘం నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. మందస మండలం ఎం.గంగువాడ గ్రామంలో బుధవారం కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ బహిరంగ సభ నిర్వహించారు. కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కొమర వాసు అధ్యక్షతన జరిగిన ఈ సభలో శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ జిల్లాకు పోరాటాల్లో ఘనమైన చరిత్ర ఉందన్నారు. ఆంధ్ర ఉద్యమాల ఐక్య వేదిక కన్వీనర్ మహదేవ్ మాట్లాడుతూ పోలీసు నిర్బంధం పైన హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేస్తామన్నారు.

అడుగడుగునా ఆంక్షలే

మందస: మందస మండలం ఎం.గంగువాడ గ్రామంలో కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా రైతులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పోలీసులు అడుగడుగునా ఆటంకాలు సృష్టించారు. ఎక్కడికక్కడ పోలీసు వాహనాలు పెట్టి బహిరంగ సభ అడ్డుకోవడానికి ప్రయత్నించారు. చివరకు తోటలో నిర్వహించుకోవడానికి షరతులతో కూడిన అనుమతులు ఇచ్చారు.



మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

వ్యతిరేకంగా పోరాటం చేస్తాం..



కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా 15 నెలల నుంచి పోరాటం చేశాం. దానిపై ప్రభుత్వం స్పందించలేదు. ఇప్పుడు బహిరంగ సభ ఏర్పాటు చేస్తే పోలీసులతో నిలిపివేయించారు. ఇలాంటి కుతంత్రపు రాజకీయాలు ఎందుకు..?

– బత్తిన లక్ష్మణరావు, బేతాళపురం

ఉద్దానాన్ని వదులుకోబోము..

ఎన్ని అవాంతరాలు ఎదురైనా కార్గో ఎయిర్‌పోర్టును నిలిపి తీరుతాం. మా పచ్చటి ఉద్దానాన్ని వదులుకోవడానికి మేం సిద్ధంగా లేము.

– కె.మోహన్‌రావు, సీపీఎం కార్యదర్శి

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ప్రత్యేక గుర్తింపు

ఎచ్చెర్ల:

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అగ్రశేణి విశ్వవిద్యాలయాల్లో నిర్వహించే ఐబీఎం క్వాంటమ్ క్యూస్కిట్ పాల్ ఫెస్ట్–2025లో భాగంగా ఆర్‌జీయూకేటీ (ఐఐఐటీ) శ్రీకాకుళంను ఐబీఎం క్వాంటమ్ ప్రత్యేకంగా ఎంపిక చేసింది. మన దేశం నుంచి కేవలం పది వర్సిటీలకు మాత్రమే ఈ అవకాశం రాగా మన రాష్ట్రం నుంచి ఆర్‌జీయూకేటీ మాత్రమే ఉండడం విశేషం. ఆర్‌జీయూకేటీ విద్యార్థులు కాటం నిఖిల్, తేజ, కాశీం వాలీ, దూదేకుల ప్రవీణ్‌కుమార్, చెరుకూరి జాన్‌బాబు, చదువులు గురుశ్రీ కిమ్మిడి ఇచ్చిన ప్రజెంటేషన్ ద్వారా ఈ ఘనత సాధ్యమైంది. ఈ ఫెస్ట్ అక్టోబర్ 21 నుంచి 27 వరకూ ఆర్‌జీయూకేటీ నాలుగు క్యాంపస్‌లు శ్రీకాకుళం, నూజివీడు, ఒంగోలు, ఆర్.కె వ్యాలీలలో జరగనుంది. దేశవ్యాప్తంగా విద్యార్థులు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు ఆన్‌లైన్‌లో పాల్గొంటారు. ఈ ఫెస్ట్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్ అభివృద్ధి, ఈ రంగంలో ఉన్న అవకాశాలపై అవగాహన పెంపొందించేందుకు వర్క్‌షాప్‌లు, నిపుణుల ఉపన్యాసాలు, హ్యాక్‌థాన్ నిర్వహిస్తారు. వర్సిటీకి ఇది గర్వకారణమని శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ తెలిపారు. ఈ టెక్నికల్ ఫెస్ట్‌కు డీన్ ఎకడమిక్స్ డాక్టర్ ఎం. శివరామకృష్ణ కన్వీనర్‌గా, విద్యార్థుల కో ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు.



విద్యార్థులతో ట్రిపుల్ ఐటీ సిబ్బంది

గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సంస్కృతం, ఒరియా సబ్జెక్టుల్లో బోధనకు గెస్ట్ ఫ్యాకల్టీల నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు బుధవారం తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీతో పాటు పీహెచ్‌డీ, నెట్/స్లెట్, ఏపీసెట్ అర్హత గల అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. బోధన నైపుణ్యం, మౌఖిక పరీక్ష, ఉన్నత విద్యార్హతల వెయిటేజీ ఆధారంగా తుది ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు. బయోడేటా, విద్యార్హతలతో కూడిన దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ సాయంత్రంలోగా కళాశాలలో సమర్పించాలన్నారు. 10వ తేదీన ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

ప్రకృతి ప్రకోపం.. నాణ్యతా లోపం..

గిరిజనులకు శాపం

- ఇటీవల వర్షాలకు ఛిద్రమైన ఏజెన్సీ రోడ్లు
- రాకపోకలకు తప్పని పాట్లు



కోతకు గురైన కొత్తూరు రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్న గ్రామస్తులు



కోతకు గురై నీరు ప్రవహిస్తున్న, కేరాసింగి–గూడ రహదారి (ఫైల్)

మెళియాపుట్టి: ప్రకృతి ప్రకోపానికి తోడు పనుల్లో నాణ్యత లేకపోవడంతో గిరిజన రహదారులు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. ఉత్తరాంధ్రలోనే ఎత్తయిన గిరిజన గ్రామాలైన మెళియాపుట్టి మండలం కేరాసింగి, గూడ గ్రామాలకు వెళ్లే రహదారులు కనీసం నడవటానికి కూడా అవకాశం లేని స్థితికి చేరుకున్నాయి. కేరాసింగి రహదారిలో కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. కొత్తూరు వెళ్లే రహదారితో పాటు పలురోడ్లు కోతకు గురికావడంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. అధికారులు పరిశీలనకు వచ్చి చూసి వెళ్లిపోతున్నారు తప్ప రహదారుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలని గిరిజనులు కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం



రహదారి అధ్వానంగా మారడంతో విద్య వైద్యం వంటి సేవలకు నోచుకోలేకపోతున్నాం. ముఖ్యంగా గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అవకాశం లేకుండా పోతోంది.ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

– గూడ రామారావు, కేరాసింగి

త్వరలోనే పనులు..

పాడైన రహదారులకు మరమ్మతులు చేయిస్తున్నాం. ప్రస్తుతానికి గిరిజనులకు రాకపోకలు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. రెగ్యులర్ కాంట్రాక్టర్లు త్వరలోనే పనులు చేపడతారు.

– సిమ్మన్న, డీఈ, ఐటీడీఏ సీతంపేట

క్వారీలల్లో మృత్యుఘోష



- నిరంతరం చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోతున్న కార్మికులు
- కానరాని భద్రతా చర్యలు

టెక్కలి: ఉపాధి కల్పించాల్సిన క్వారీలు కార్మికుల పాలిట మృత్యు కుహరాలుగా మారుతున్నాయి. ఉదయం వాహనాల్లో కిక్కిరిసి క్వారీలకు వెళ్లింది మొదలు...తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చే వరకు కార్మికుల ప్రాణాలకు భద్రత లేకుండా పోతోంది. ఈ ఏడాది మే నెలలో మెళియాపుట్టి మండలం దీనబంధుపురం సమీపంలో దబ్బగూడ కొండపై మానీష్ కూనపు రెడ్డి గ్రానైట్ క్వారీలో జరిగిన పేలుడు సంఘటనలో ముగ్గురు కార్మికులు చనిపోయారు. మొదట పిడుగుపాటు అని చెప్పినా.. ఆ తర్వాత బ్లాస్టింగ్‌ల వల్లే చనిపోయారని తెలిసింది. రెండు రోజుల కిందట ఇదే మెళియాపుట్టి మండలం గంగరాజపురం సమీపంలో రాజయోగి క్వారీలో జరిగిన సంఘటనలో ముగ్గురు కార్మికులు మృత్యువాత పడగా మరో నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. గతంలోనూ టెక్కలి మండలంలో ఓ గ్రానైట్ క్వారీలో జరిగిన సంఘటనలో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ మృత్యువాత పడ్డాడు. గత ఏడాది మరో క్వారీలో గ్రానైట్ బ్లాక్‌ను డ్రిల్ చేస్తుండగా జరిగిన సంఘటనలో తాపీమేస్త్రి చనిపోయాడు. మరో క్వారీలో ఎయిర్ కంప్రెషర్ పేలి బీహార్‌కు చెందిన కార్మికుడు కన్నుమూశాడు. ఎప్పటికప్పుడు ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నా భద్రతా చర్యలు పెంచడం గానీ, అధికారులు దృష్టి సారించడం గానీ జరగలేదు. దీంతో ప్రమాదాలు కొనసాగుతున్నాయి. ఏటా జిల్లాలో గల గ్రానైట్ క్వారీల్లో జరుగుతున్న సంఘటనలతో స్థానిక కార్మికులతో పాటు ఒడిశా, బీహార్, రాజస్థాన్, తమిళనాడు తదితర ప్రాంతాలకు చెందిన వలస కార్మికులు మృత్యువాత పడుతున్నారు.

భద్రత ఉందా..?



గ్రానైట్ క్వారీ నిర్వహణలో ముఖ్యంగా హెల్మెట్లు, సేఫ్టీ షూస్, గ్లోవ్స్, సేఫ్టీ గాగుల్స్ లాంటి వ్యక్తిగత రక్షణ పరికరాలు అందించడం తప్పనిసరి. క్వారీ పని ప్రాంతాలకు భద్రతా గేట్లు ఉండాలి. భద్రతా సిగ్నల్స్, హెచ్చరికలతో సరైన హెచ్చరిక వ్యవస్థ ఏర్పాటు చేయాలి. సురక్షిత విధానాలు పాటించడం, వాటిపై కార్మికులకు శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించడం, మిషన్లకు తగిన రక్షణ కవచాలు ఏర్పాటు చేసి, సరైన నిర్వహణ జరపాలి. ప్రమాద నిరోధక బోర్డులను ఏర్పాటు చేసి విపత్తుల నిర్వహణపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలి. పని ప్రదేశంలో పూర్తిగా సీసీ పర్యవేక్షణ, యాజమాన్యం పర్యవేక్షణ వ్యవస్థ కలిగి ఉండాలి. ముఖ్యంగా మైన్స్ మేనేజర్ పర్యవేక్షణ ఉండాలి. కానీ జిల్లాలోని క్వారీల్లో ఆ పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. క్వారీల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులకే దగ్గరుండి అవగాహన కల్పించాలి. కానీ ఈ కార్యక్రమాలు ఎప్పుడు నిర్వహిస్తున్నారో వారికే తెలియాలి.

వలస చట్టం ఉంది తెలుసా..?



ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రంలో గల పరిశ్రమలు, క్వారీల్లో పనిచేసేందుకు వలస వస్తున్న కార్మికుల కోసం ఇంటర్ స్టేట్ మైగ్రేట్ వర్క్‌మెన్ 1979 చట్టాన్ని రూపకల్పన చేశారు. ఈ చట్టం ద్వారా ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్న వలస కార్మికులకు కనీస వేతనాలు, ఉపాధి, వసతి, వైద్యం కల్పించాలి. పని ప్రదేశాల్లో మరణిస్తే ఆయా యాజమాన్యాలు పూర్తి స్థాయిలో వారికి అండగా నిలిచి నష్ట పరిహారాన్ని అందజేయాలి. అంతే కాకుండా కార్మిక శాఖాధికారులతో సమన్వయం చేసుకుంటూ కార్మికుల సంక్షేమానికి అండగా ఉండాలి. ప్రమాదాల తర్వాత ఆయా కుటుంబాలకు అండగా నిలిచి వారి పిల్లల చదువుల విషయంలో యాజమాన్యాలు సాయం చేయాలి. కానీ ఈ చట్టంపై కార్మికులకు అవగాహనే లేదు.

క్షతగాత్రులకు పరామర్శ



క్షతగాత్రులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

టెక్కలి: మెళియాపుట్టి మండలం గంగరాజపురం సమీపంలో రాజయోగి గ్రానైట్ క్వారీలో జరిగిన సంఘటనలో తీవ్రంగా గాయపడి టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను బుధవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి తదితరులు పరామర్శించారు. సంఘటన వివరాలను క్షతగాత్రులను అడిగి తెలుసుకున్నారు. అలాగే వారి ఆరోగ్య పరిస్థితులపై ఆస్పత్రి సూపరింటెండెంట్ సూర్యారావును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరఫున మెరుగైన వైద్యం అందజేస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ భరోసా ఇచ్చారు.

క్వారీ సంఘటనపై ఎస్పీ ఆరా



పిడుగు పాటు సంభవించిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

మెళియాపుట్టి: గంగరాజపురం గ్రామంలోని రాజయోగి క్వారీలో మంగళవారం పిడుగు పడిన ప్రదేశాన్ని ఎస్పీ మహేశ్వరరెడ్డి పరిశీలించారు. ప్రమాదం ఎలా చోటుచేసుకుంది అనే కోణంలో దర్యాప్తు నిర్వహించాలని స్థానిక పోలీసులకు ఆదేశించినట్లు తెలుస్తోంది. పిడుగుల వల్ల ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో మెప్మా డైరెక్టర్



తేజ్‌భరత్‌కు జ్ఞాపిక అందజేస్తున్న అర్చకులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర మెప్మా డైరెక్టర్ తేజ్‌భరత్ బుధవారం దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం అధికారులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను అర్చకులు ఇప్పిలి సాందీప్‌శర్మ వివరించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ఘటనా స్థలంలో ఆటో, కారు

పోలాకి: వెదుళ్లవలసలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. నరసన్నపేట నుంచి వస్తున్న కారు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనలో గాయపడిన వారంతా సుసరాం, భగీరథపురం గ్రామానికి చెందిన వారు. క్షతగాత్రులను 108 అంబులెన్సులో నరసన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంజిత్ తెలిపారు.

దుబాయ్‌లో పాలవలస యువకుడు మృతి



ఓంకార్(ఫైల్)

సోంపేట: పాలవలస గ్రామానికి చెందిన తామాడ ఓంకార్ (21) దుబాయ్‌లో అనుమానాస్పదంగా మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తామాడ నీలవేణి కుమారుడు ఓంకార్ ఆరు నెలల క్రితం బతుకు తెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. ఈ నెల 3న దుబాయ్‌లో అనుమానాస్పదంగా మృతి చెందినట్లు బుధవారం కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. ఓంకార్ తండ్రి ఐదేళ్ల క్రితం మృతి చెందాడు,. ఒక్కగానొక్క కుమారుడు కూడా మృతి చెందడంతో తల్లి నీలవేణి కన్నీరు మున్నీరుగా విలపించింది.

కిడ్నీ వ్యాధితో మహిళ మృతి



సప్ప గోపమ్మ(ఫైల్)

కంచిలి: సాలినపుట్టుగ గ్రామానికి చెందిన సప్ప గోపమ్మ(48)కు కిడ్నీలు పాడైపోవడంతో బుధవారం మృతిచెందింది. ఈమె కొన్నాళ్లుగా డయాలసిస్ చేయించుకుంటోంది. పరిస్థితి విషమించడంతో మృత్యువాత పడింది. గోపమ్మకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బహిరంగంగా మద్యం సేవిస్తే జైలుశిక్ష

శ్రీకాకుళం క్రైమ్ : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి న్యూసెన్సు చేసినా, తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి బుధవారం హెచ్చరించారు. తాజాగా జిల్లాకేంద్రంలోని ఓ యువకుడు ఇలా ప్రవర్తించడంతో 45 రోజుల జైలు శిక్ష పడిందని గుర్తు చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ద్విచక్రవాహనాలపై మద్యం సేవించి హల్‌చల్ చేస్తూ తిరిగితే భారీ జరిమానాతోపాటు వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

స్కూల్‌గేమ్స్ క్రికెట్ పోటీలు ప్రారంభం



ఇరు జట్ల క్రీడాకారులకు సూచనలిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జెడ్‌సీఎస్ స్కూల్‌గేమ్స్ హర కేశవ మెమోరియల్ పేరిట జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ 2025 సీజన్-1 పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 32 జట్లు ప్రాతినిధ్యం వహించాయి. అనంతరం పోటీలు హోరాహోరీగా సాగాయి. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీవై ఎన్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా షేక్, మెంటార్ ఇలియాస్ మహ్మద్, జిల్లా చీఫ్ సెలెక్టర్ కొట్టిస కిరణ్, హెడ్‌కోచ్ కె.సుదర్శన్, డాక్టర్ సువ్వారి రవికుమార్, కోచ్ అన్నెపు ఆనంద్, సీనియర్ క్రికెటర్లు పాల్గొన్నారు.

- అమాంతంగా పెరిగిన ఇసుక ధరలు
- జిల్లాలో ట్రాక్టర్ ఇసుక రూ.2300 నుంచి రూ.5 వేలు
- నదుల్లో నీటి ఉద్ధృతి పెరిగిందంటూ ధరలు పెంచేసిన వైనం

ఇసుకాసురులకు.. కాసుల వరద



ట్రాక్టర్‌లో అమ్మకానికి తీసుకువెళ్తున్న ఇసుక

నరసన్నపేట :

ఇసుక ధరలకు రెక్కలొచ్చాయి. పేరుకు ఉచితమైనా ట్రాక్టర్ ద్వారా తీసుకొచ్చేందుకు అమాంతం ధరలు పెంచేశారు. వంశధార నదిలో నీటి ఉద్ధతి పెరిగి నదీతీర గ్రామాల్లో వరద రావడం, ప్రస్తుతం నదిలో నీరు అధికంగా ప్రవహిస్తుండటంతో ఇసుకాసురులు ఇదే అదునుగా ధరలు పెంచేశారు. నదిలో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయంటూ ఉచిత ఇసుక ధరలను అమాంతం పెంచేసి సామాన్యులను దోపిడీకి గురిచేస్తున్నారు.

పేరుకే ఉచితం..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తొమ్మిది నెలలు తర్వాత ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చారు. ఇసుకను ఎవరైనా ఉచితంగా నది నుంచి తీసుకువెళ్లవచ్చని ప్రభుత్వం చెబుతున్నా వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. వేసవిలో ట్రాక్టర్ ఇసుక ధర రూ.900 నుంచి రూ.3 వేలు వరకూ జిల్లాలో విక్రయాలు సాగాయి. అదే ఆగస్టులో ఈ ధరలు కొంత పెంచారు. వర్షాకాలం వచ్చింది.. నదిలోనికి ట్రాక్టర్లు వెల్లడం లేదు.. ఇసుక తవ్వకాలకు ఇబ్బంది అవుతుందని ట్రాక్టర్ల యజమానులు, ఇసుకాసురులు ధరలు నాలుగైదు వందలు పెంచారు. తాజాగా వారం రోజులుగా వంశధార నదిలో నీటి ఉద్ధృతి పెరిగింది. సమీపం గ్రామాలు ముంపునకు గురయ్యాయి. దీనిని అలుసుగా తీసుకొని ఇసుకాసురులు ఉచిత ఇసుక ధరలను అమాంతంగా పెంచేశారు.

ముందే నిల్వలు..

వరద పరిస్థితి ఏర్పడుతుందని ముందుగా ఊహించిన ఇసుకాసురులు ఇప్పటికే జీడి తోటలు, తమ సొంత స్థలాలు, ఇళ్ల వద్ద భారీగా ఇసుక నిల్వ చేశారు. ఇదే ఇసుకను ఇప్పుడు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక నరసన్నపేట ప్రాంతంలో రూ.2300 పలుకుతోంది. దూరం బట్టి ధరలు మరింత ఎక్కువగా ఉన్నాయి. ఉచిత ఇసుక ధరలు ప్రస్తుతం జిల్లాలో రూ.5 వేలు వరకూ ఉన్నట్లు సమాచారం. లారీల్లో విశాఖకు తరలించే ఇసుక ధరలు కూడా బాగా పెరిగాయి. లారీ ఇసుక ప్రస్తుతం రూ.25వేల వరకూ విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఉచిత ఇసుకకు ఇంత ధరా అని గృహ నిర్మాణదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ఇసుక ధరలను అదుపు చేయాలని పలువురు కోరుతున్నారు.



రూ.2400 చెల్లిస్తేనే..

ఇంటి పని చేస్తున్నాం. ఇసుక అవసరమని ప్రయత్నిస్తే ట్రాక్టర్ ఇసుక రూ.2400 అంటున్నారు. ఎందుకు ఇంత ధర అని ప్రశ్నిస్తే.. నదిలో నీరు వస్తుందమ్మా.. ఏదో మీరు అడుగుతున్నారు కాబట్టి ఈ ధరకు ఇస్తున్నాం.. లేకపోతే ఇంకా ఎక్కువ ధరే ఉంటుంది.. అని ట్రాక్టర్ డ్రైవర్ అంటున్నారు. అత్యవసరమై కొన్నాం.

– బోగి పద్మజ, అనుపోజు అరుణకుమారి, జగనన్న కాలనీ, గడ్డెయ్యపేట

కూర్మాలు, గోవులను చంపే సంస్కృతి మంచిది కాదు



ప్రమాణస్వీకారం చేస్తున్న కూర్మనాథాలయ ట్రస్టు బోర్డు సభ్యులు

గార: జిల్లాలోని పవిత్ర శ్రీకూర్మ క్షేత్రంలో కూర్మాలు, సింహాచలంలో గోవులను చంపే సంస్కృతి మంచిది కాదని గోవా గవర్నర్, శ్రీకూర్మనాథాలయం ధర్మకర్త పూసపాటి అశోకగజపతిరాజు అన్నారు. బుధవారం శ్రీకూర్మనాథాలయ ట్రస్ట్ బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారం కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్త హోదాలో ఆయన పాల్గొన్నారు. గవర్నర్ మాట్లాడుతూ సభ్యులు దైవ సేవ చేసేందుకే వచ్చామని భావించాలని, దేవునికి బాధ్యతతో పనిచేయాలన్నారు. చట్టబద్దీత్యా ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేశారన్నారు. దేవస్థానంలోని ఆకుపసర చిత్రాలు (మ్యూరల్స్) వేసిన పూర్వీకుల నైపుణ్యాలను భావి తరాలకు అందించాల్సి ఉందన్నారు. ట్రస్టు బోర్డు సభ్యులకు గైడ్‌లైన్స్ ఉన్న పత్రాలను ఇవ్వకపోవడంతో ఈఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు. అనంతరం స్వామిని దర్శించుకొని ఆలయంలో రాతి స్తంభాలు, ఆకుపసర చిత్రాలు, కాశీద్వారం పరిశీలించారు. శాలిహుండం బౌద్ధారామాలను సందర్శించి, కొండపై ఉన్న ఆరామాలను పరిశీలించారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, దేవదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్‌పట్నాయిక్, అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఆలయ ప్రధానార్చకులు చామర్ల సీతారామనృసింహాచార్యులు, సభ్యులుగా కైబాడి కుసుమకుమారి, పల్ల పెంటయ్య, గొండు శ్రీనివాసరావు, అంధవరపు మౌనిక, ఆరవెల్లి శ్వేతబిందు, తాన్ని సూరిబాబు, మళ్ల కల్యాణచక్రవర్తి, జమ్ము లక్ష్మీతో ఆలయ ఈవో కోట నరసింహానాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి



ప్రభాకరరావు మృతదేహం

గార: సతివాడ పంచాయతీ మాజీ సర్పంచ్ గంగు ప్రభాకర రావు (రమణ)() బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శుభకార్యం నిమిత్తం గార వైపు వెళ్తుండగా నిజామాబాద్ –తూలుగు జంక్షన్ మధ్య బైక్ అదుపు తప్పడంతో కింద పడిపోయారు. ఈ ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ప్రభాకరరావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మాజీ సర్పంచ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

13 నుంచి ఎఫ్‌ఏ -2 పరీక్షలు



నరసన్నపేట ఎంఆర్‌సీకి వచ్చిన ప్రశ్నపత్రాలు పరిశీలిస్తున్న ఎంఈఓ

నరసన్నపేట: పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యం తెలుసుకొనేందుకు ఎఫ్‌ఏ–2 పరీక్షలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 13 నుంచి ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు స్కూల్స్‌లో విద్యార్థులు ఈ పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రశ్న పత్రాలు ఆయా మండలాల ఎంఆర్‌సీలకు వచ్చాయి. ఒకటి నుంచి ఐదు తరగతులకు చెందిన విద్యార్థులు 13న ఉదయం తెలుగు(మొదటి లాంగ్వేజ్), సాయంత్రం గణితం, 14న ఉదయం ఇంగ్లీషు, సాయంత్రం ఎన్విరాల్‌మెంటల్ సైన్స్, 15న ఓఎస్ఎస్‌సీ పరీక్షలు రాయనున్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు 13న ఉదయం తెలుగు, సాయంత్రం గణితం, 14న ఉదయం హిందీ, సాయంత్రం జనరల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ రాయాల్సి ఉంటుంది. 15న ఉదయం ఇంగ్లీషు, సాయంత్రం సోషల్, 16న బయోలాజికల్ సైన్స్, సాయంత్రం ఓఎస్ఎస్‌సీ పరీక్షలు రాయనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నరసన్నపేట ఎంఈఓ శాంతారావు తెలిపారు.

చీటింగ్ కేసులో ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ మధుసూదనరావు

పాతపట్నం: చీటింగ్ కేసులో ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్ తరలించారు. ఎస్ఐ కె.మధుసూదనరావు బుధవారం కేసు వివరాలు వెల్లడించారు. పాతపట్నం మండలం చిన్నపద్మాపురం గ్రామానికి చెందిన బి.వెంకట్రావు, సారవకోట మండలం గోవర్ధనపురం గ్రామానికి చెందిన జి.రమేష్‌లు పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం సమీపంలో శేషారావు పేరిట భూమికి సంబంధించి ఫోర్జరీ సంతకాలతో తప్పుడు పత్రాలను సృష్టించారు. ఆ భూమిని పాతపట్నం శాంతినగర్‌కు చెందిన సీహెచ్ శ్రీనివాసరావుకు అమ్మచూపి, రూ.13.50 లక్షలు తీసుకుని మోసం చేశారు. తిరిగి డబ్బులు అడిగితే టెక్కలి మండలం లింగాలవలసకు చెందిన వై.గోపితో పాటు మరికొందరితో బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ మేరకు సీహెచ్ శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెంకట్రావు, రమేష్‌లపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

విషాదం మిగిల్చిన చేపల వేట

హిరమండలం: చేపలు వేటాడే క్రమంలో ముగ్గురు స్నేహితులు ప్రమాదానికి గురయ్యారు. ఇద్దరు అతికష్టమ్మీద ఒడ్డుకు చేరుకోగా.. మరొకరు ఊపిరాడక మృతిచెందారు. ఈ విషాద ఘటన ఎల్ఎన్‌పేట మండలం జంబాడ రిజర్వాయర్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జంబాడ గ్రామానికి చెందిన ఇరమాక సతీష్, నిమ్మక సతీష్, నిమ్మక లక్ష్మీనారాయణలు స్థానిక రిజర్వాయర్ మదుం వద్ద చేపలను వేటాడేందుకు దిగారు. ఈ క్రమంలో ముగ్గురూ ఊపిరాడక అస్వస్థతకు గురయ్యారు. ఇరమాక సతీష్ (25) మదుం వద్ద చిక్కుకోగా.. నిమ్మక సతీష్, లక్ష్మీనారాయణ అతి కష్టమ్మీద బయటకు వచ్చారు. మదుం వద్ద చిక్కుకున్న సతీష్‌ను బయటకు తీయగా అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికుల సహకారంతో ఎల్ఎన్‌పేట పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే సతీష్ మృతిచెందాడు. సతీష్ స్వగ్రామం పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం. ప్రమాద విషయమై ఫిర్యాదు అందలేదని సరుబుజ్జిలి ఎస్సై హైమావతి తెలిపారు.

కోర్కెలు తీర్చే కొంగుబంగారం

గర్భగుడి గోలెం

పరమ పవిత్రం.. శ్రీముఖలింగ క్షేత్రం

- ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కార్తీకం ప్రారంభం
- భారీగా తరలిరానున్న భక్తులు



శ్రీముఖలింగం గర్భగుడిలో గోలెం, (ఇన్‌సెట్లో) బియ్యంతో నిండుగా ఉన్న గోలెం

జలుమూరు: దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగం. ఎక్కడైనా శివుడు లింగాకారంలో ఉంటాడు. ఈ క్షేత్రంలో మాత్రం ముఖందాల్చి ఆవిర్భవించాడు. అందుకే ఈ క్షేత్రానికి శ్రీముఖలింగమని, ఇక్కడ కొలువైన శివుడిని ముఖలింగేశ్వరుడని పిలుస్తారు. కాశీలో లింగం, గంగలో స్నానం, శ్రీశైలంలో శిఖరం, శ్రీముఖలింగంలో ముఖ దర్శనం చేసుకుంటే మోక్షం సిద్ధిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. మంగళవారం నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో కార్తీకమాసం పూజలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి శ్రీముఖలింగేశ్వరున్ని దర్శించుకుంటారు.



శ్రీముఖలింగం ప్రధాన ఆలయం

కోర్కెలు తీర్చే గోలెం..

స్వామివారి గర్భాలయంలో మూలవిరాట్టు వెనుక కనిపించే పెద్ద మట్టి గోలెం ఎంతో శక్తివంతమైనదని భక్తుల విశ్వాసం. ఇందులో పాలు, బియ్యం, ధాన్యం, మంచినీరు, అన్నం, పండ్లు, బెల్లం.. ఇలా భక్తులు గోలెం నిండుగా వేసి మొక్కులు తీర్చుకుంటారు. దీని ఫలితంగా సంతాన యోగం, గ్రహదోషాలు నివారణ, వివాహాలు, ఉద్యోగాలు, విదేశాలలో చదువులు, ఇతర న్యాయపరమైన కోర్కెలు సిద్ధిస్తాయని స్థలపురాణంతో పాటు అర్చకులు చెబుతున్నారు. గోలెం పట్టుకుని పరమేశ్వరుని నిండు మనసుతో ప్రార్థిస్తే కోరిన కోర్కెలు తీరుతాయన్నది భక్తుల నమ్మకం.

ఆ భక్తులకు ప్రత్యేకం..

మన రాష్ట్రంలో రాయలసీమతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల భక్తులు గురువారం నుంచే కార్తీకమాసం పాటిస్తారు. ఇదే నెలలో దైవ చింతన, తీర్థయాత్రలు చేయడం వారి సంప్రదాయం. ఇందులో భాగంగా శ్రీముఖలింగం క్షేత్రానికి నెల రోజులపాటు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుంటారు.

నేత్రం.. జరభద్రం!



- చిన్నప్పటి నుంచే పెరుగుతున్న కంటి సమస్యలు
- తీవ్రంగా ప్రభావం చూపుతున్న ఫోన్ వినియోగం
- నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. అంతటి ప్రాముఖ్యత కలిగిన నేత్రాలపై కొందరు అశ్రద్ధ వహిస్తున్నారు. ఫలితంగా చిన్నప్పటి నుంచే దృష్టి సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కళ్ల సంరక్షణపై అవగాహన పెంచేందుకు ఏటా అక్టోబర్‌లో వచ్చే రెండో గురువారాన్ని 'ప్రపంచ దృష్టి దినోత్సవం'గా జరుపుకుంటున్నారు. అంధత్వం, దృష్టిలోపం కలగకుండా ప్రజలను చైతన్యపరిచేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఇలా వద్దు..

- నిద్రలేవగానే సెల్ చూడడం వల్ల ఒత్తిడి పెరిగి శరీరంలో అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నిద్రపోయే ముందు మొబైల్ వాడటం వల్ల నిద్రలేమి కలుగుతుంది.
- స్మార్ట్ ఫోన్ ఎక్కువ సమయం వాడితే కళ్లు పొడిబారి, మసకబారి తలనొప్పి మొదలవుతుంది. 'డ్రై ఐ సిండ్రోమ్' అనే కంటి వ్యాధికి గురవుతారు.
- విద్యార్థులు స్మార్ట్ ఫోన్‌లో ఎక్కువ సమయం అనుచితమైన విషయాలు, వీడియోలు చూడటం వల్ల నేర ప్రవృత్తికి మరలే ప్రమాదం ఉంది.
- కళ్లకు సరైన విశ్రాంతి లేకపోవతే చూపు మందగిస్తుంది. కళ్లు సరిగా కనపడక చిన్నతనంలోనే కళ్లద్దాలు వస్తాయి.

ఇలా ముద్దు..

- స్మార్ట్ ఫోన్, కంప్యూటర్ స్క్రీన్‌కు కంటికి మధ్య కనీసం 25 అంగుళాల దూరం ఉండాలి.
- ప్రతి 20 నిమిషాలకు కళ్లకు విశ్రాంతి ఇవ్వాలి. నేత్రాలను క్రమపద్ధతి ప్రకారం మూసి తెరవడం వల్ల కళ్లు తేమగా మారి ప్రకాశవంతంగా ఉంటాయి.

అవగాహన కల్పిస్తున్నాం..



జాతీయ అంధత్వ, దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎన్జీవో కంటి ఆసుపత్రుల్లో కంటి వైద్య సేవలు ఉచితంగా అందజేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలో అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ ఎస్.పుష్పలత, ప్రోగ్రాం మేనేజర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శ్రీకాకుళం

నేత్రాలపై శ్రద్ధ అవసరం..



కళ్లపై శ్రద్ధ వహించాలి. ముఖ్యంగా చిన్నారుల కంటి ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి. స్కూల్లో చేర్చే ముందే కంటి పరీక్షలు చేయించాలి. మధుమేహం, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, 40 ఏళ్లు పైబడిన వారి ప్రతి ఏడాది తప్పనిసరిగా నేత్రవైద్య నిపుణులను సంప్రదించడం వల్ల శాశ్వత అంధత్వం నుంచి తప్పించుకోవచ్చు.

– ఎం.ఆర్.కె.దాస్, ఆప్తాలమిక్ అధికారి

- దృష్టిలోపం ఉన్నట్లు భావిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి కళ్లద్దాలు ధరించాలి.
- బ్లూరే కట్, యాంటీ గ్లేర్ గ్లాసెస్ ఉపయోగించడం మంచిది.
- ఆహారంలో పండ్లు, కూరగాయలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.

ముంపు ప్రాంతాల పరిశీలన



పాతపట్నం మండలంలోని కాపు గోపాపురం, హరిజన గోపాలపురం, హిరమండలం మండలంలోని జిల్లోడిపేట, కల్లట గ్రామాల్లో నీటి మునిగిన వరి, తదితర పంటలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం రైతులతో కలిసి పరిశీలించారు.బాధిత రైతులకు పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు. – పాతపట్నం

గంజాయి రవాణా కేసులో వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సూర్యనారాయణ

పలాస: గంజాయిని అక్రమంగా కర్ణాటక రాష్ట్రానికి తరలించడానికి పలాస రైల్వే స్టేషన్ వైపు వెళ్తున్న మహ్మద్ ఫయాజ్‌ను కాశీబుగ్గ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ చెప్పారు. బరంపురం నుంచి పలాస వరకు బస్సులో వచ్చి పలాస రైల్వే స్టేషన్‌కు వెళుతుండగా నిందితుడిని పట్టుకొని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఫయాజ్‌ను బుధవారం కోర్టులో హాజరుపరిచామన్నారు.

13 నుంచి ఐద్వా రాష్ట్ర మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న బి.పద్మ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అనంతపురంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో జరగనున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు బి.పద్మ పిలుపునిచ్చారు. బుధవారం ఎన్జీవో హోమ్‌లో ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మాదక ద్రవ్యాల వినియోగం విపరీతంగా పెరగడంతో యువత జీవితాలు సర్వనాశనం అవుతున్నాయన్నారు. మహిళా ఓట్లతో గెలిచిన ప్రభుత్వాలు మహిళా సాధికారత గాలికొదిలేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా ఉద్యమాన్ని బలోపేతం చేసి, మహిళా హక్కుల సాధన దిశగా ఈ మహాసభలు మార్గదర్శకత్వం కానున్నాయన్నారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, సీఐటీయూ ఉపాధ్యక్షులు మహాలక్ష్మి, అంగన్‌వాడీ జిల్లా నాయకులు లతాదేవి, టి.ప్రవీణ, జి.అనురాధ, ఎం.లక్ష్మి, పి.శ్రీదేవి, జానకి, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బంది తీరుపై కలెక్టర్ ఆగ్రహం



బల్లిపుట్టుగలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

కవిటి: బల్లిపుట్టుగ రైతుల జాయింట్ ఎల్‌పీఎం, వన్‌బీ, అడంగల్ తదితర భూముల సమస్యలపై రెవెన్యూ సిబ్బంది వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తీవ్ర స్థాయిలోఆగ్రహం వ్యక్తం చేశారు. పలాస ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన నెలవారీ సమీక్షలో రైతుల సమస్యలపై తహసీల్దార్ మురళీమోహనరావును కలెక్టర్ ప్రశ్నించగా స్పందన లేకపోవడంతో సమావేశాన్ని అర్ధంతరంగా ముగించేశారు. నేరుగా బల్లిపుట్టుగ విచ్చేసి క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడారు. వీఆర్‌ఓ నుంచి మండల స్థాయి అధికారి వరకు ఎవరూ తమ గ్రామానికి సమస్య పరిష్కారం కోసం రాలేదని చెప్పడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో 220 ఖాతాలకు సంబంధించి జాయింట్ ఎల్‌పీఎంలో నమోదైన రైతులందరి నోటీసులు జారీ చేసి నోషనల్ ఖాతాలుగా మార్చి డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వరరావు, పలాస ఆర్డీఓ వెంకటేష్ పర్యవేక్షణలో రైతులకు భూమి హక్కు కల్పించేందుకు చర్యలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. దీనిపై ప్రతి రెండుగంటలకోసారి ఫోన్‌లో రివ్యూ చేస్తానని తెలియజేసి వెనుదిరిగారు.